నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 2 మే 2024 | SANGAREDDY

చిన్నకోడూరు రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

కేసీఆర్ బస్సుయాత్రతో
వణుకుతున్న రేవంత్

- సీఎం స్థాయి మరచి దిగజారి మాట్లాడుతున్న రేవంత్
- ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి
- మంచి మనిషి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- చిన్నకోడూరులో రోడ్ షో
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

చిన్నకోడూరు రోడ్ షోకు భారీగా హాజరైన ప్రజలు

చిన్నకోడూరు, మే 1: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రతో సీఎం రేవంత్‌రెడ్డి గజగజ వణుకుతున్నాడని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, మండల నాయకులతో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజల కోసం కేసీఆర్ బస్సుయాత్ర చేస్తుంటే కాంగ్రెస్, బీజేపోళ్లకు కండ్లు మండుతున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం స్థాయి మరిచి కేసీఆర్ లాంటి గొప్ప వ్యక్తిపై దిగజారి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ప్రధానమంత్రి మోదీ మతవిద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ లేకుం టే తెలంగాణ వచ్చేదా, కొత్త జిల్లాలు అయ్యేవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన ఏ పాటిదో ప్రజలకు అర్థమైందన్నారు. ఇచ్చిన హామీ లు అమలు చేయని దద్దమ్మపార్టీ అన్నారు. రఘునందన్‌రావు మనకు నష్టం చేశారని, దుబ్బాక ఉప ఎన్నికలో అనేక హామీలిచ్చి అరచేతిలో వైకుంఠం చూపాడని, దుబ్బాకలో చెల్లని వ్యక్తి ఇక్కడ ఎలా చెల్లుతాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ప్రజలందరూ దీవించి పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు.

పేదలకు సేవ చేసే అవకాశమివ్వండి: వెంకట్రామిరెడ్డి

పేదలకు సేవచేసే అవకాశమిచ్చి, ఆశీర్వదించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రజలను కోరారు. మీ అందరి ఆదరణతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మీలో ఒకడిగా ఉంటానని, ప్రజల కష్ట, సుఖాల్లో పాలుపంచుకుంటానని హామీనిచ్చారు. విద్యకు ప్రాముఖ్యతనిచ్చి పేద పిల్లల కోసం రూ.వంద కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తానన్నారు. పేదల కోసం నియోజకవర్గానికి ఒక ఫంక్షన్ హాల్ నిర్మిస్తానన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మంచి ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం గౌడ్, వైస్ ఎంపీపీ పాపయ్య, మెదక్ ఉమ్మడి జిల్లా గొర్లకాపరుల మాజీ అధ్యక్షుడు శ్రీహరి యాదవ్, సీనియర్ నాయకుడు రామచంద్రం, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు గుండెల్లి వేణు, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నంగునూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు, పక్కన మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

మాట తప్పిన కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

- మంచి వ్యక్తి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- నంగునూరు మండలకేంద్రంలో భారీ రోడ్‌షో

నంగునూరు, మే 1: కేంద్రం తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందని చెప్పే రేవంత్‌రెడ్డి ఈ నాలుగు నెలల్లో నువ్వుచ్చింది కూడా గాడిద గుడ్డేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ ఎన్నికలు అధికారం కోసం, పదవుల కోసం కాదని, తెలంగాణ భవిష్యత్ కోసమే అన్నారు. బుధవారం నంగునూరు మండలకేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కేంద్రం పదేండ్లలో మొండిచేయి చూపితే, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని రేవంత్‌రెడ్డి మాట తప్పారన్నారు. రూ.2 లక్షలు రుణమాఫీ, రూ.4 వేల పింఛన్, రైతుబంధు, మహిళలకు రూ.2500, పంట బోనస్ రూ.500 ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. కేసీఆర్ వల్లే మన కాలువల్లోకి నీళ్లు వచ్చి రెండు పంటలు పండాయన్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్‌తో చెరువులు నింపి బంగారం లాంటి పంటలు పండించామన్నారు. ఈ ఎన్నికలు సిద్దిపేట ఆత్మగౌరవ ప్రతీక అని, సిద్దిపేట పరువు తీసే ప్రయత్నం చేస్తున్న రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మంచి వ్యక్తి అయిన వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్‌గా నాడు సేవలు అందించానని, నేడు ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానన్నారు. కేసీఆర్ ఆశీస్సులు, హరీశ్‌రావు సూచనతో గెలుస్తాననే నమ్మకం ఏర్పడిందని ధీమా వ్యక్తం చేశారు. రూ.వంద కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద పిల్లల విద్య కోసం, పోటీ పరీక్షలు ప్రిపేరయ్యే వారికి ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తానన్నారు. రూ.పది లక్షల ప్రమాద బీమా అందరికీ చేస్తానని ప్రజలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు రోడ్ షోకు భారీగా హాజరైన ప్రజలు

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి
జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్, మే 1(నమస్తే తెలంగాణ): ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగుల సౌకర్యార్థం ఆర్డీవో కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లో ఈనెల 4 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లుతో కలిసి మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కేటాయింపు అలర్ట్‌మెంట్ కౌంటర్లను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. నియోజకవర్గానికి ఒక ఫెసిలిటేషన్ సెంటర్, ఇతర నియోజకవర్గం, జిల్లాలకు చెందిన ఉద్యోగులకు వేర్వేరు ఫెసిలిటేషన్ సెంటర్లను నిర్వహిస్తున్నామని, ఆయా కేంద్రాల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ను వినియోగించుకోవలని కోరారు. ఆదివారం కూడా ఫెసిలిటేషన్ సెంటర్లు పనిచేస్తాయని, ప్రభు త్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని రాహుల్‌రాజ్ కోరారు. డీఆర్‌డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

మెదక్‌లో పోస్టల్ బ్యాలెట్ కేటాయింపు కౌంటర్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

బీజేపీ గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మచ్చలేని వ్యక్తి
- సిద్దిపేట ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటలో ఓటు అడుగుతున్న హరీశ్ రావు, వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట, మే 1: మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకట్రామిరెడ్డి మచ్చలేని నాయకుడు అని, ఆయనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ అభ్యర్థి గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని లాల్‌కమాన్ ఏరియాలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ వస్తున్నందున రఘునందన్‌రావు ఓర్వలేక పోతున్నారని చెప్పారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నికలో ఫేక్ వీడియోలు సృష్టించి కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నాడంటూ తప్పుడు ప్రచారం చేసి గెలుపొందారన్నారు. బీజేపీ చేస్తున్న అబద్ధపు గోబెల్స్ వీడియోలు చూసి ప్రజలు మోసపోవద్దన్నారు. చాలామంది నాయకులు ఆస్తులు కూడబెట్టుకోవడానికి ఎన్నికల్లో పోటీ చేస్తే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సొంత ఆస్తిలో కొంత ప్రజలకు పంచి పెడతానంటూ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. మచ్చలేని మనిషి, కలెక్టర్‌గా ప్రజల ఆశీస్సులు పొందిన వ్యక్తి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెంకట్రామిరెడ్డికి ప్రజలు నీరాజనం పడుతున్నారన్నారు. కేసీఆర్ కోరిక మేరకు వెంకట్రామిరెడ్డి మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్నాడని, అందరిలా డబ్బు కోసం కాకుండా ప్రజాసేవ చేయడానికి బరిలో నిలిచాడన్నారు. బీజేపీ అభ్యర్థిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, పాల సాయిరాం, మణిదీప్ రెడ్డి, బొంపల్లి శ్రీహరి, పూజల వెంకటేశ్వర రావు, బచ్చు రమేశ్, అయితే రత్నాకర్, పుల్లూరు శివ, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రజినీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్వీ నాయకులు మేరకు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ బరిలో 130 మంది

- మెదక్‌లో 44 మంది, జహీరాబాద్‌లో 19 మంది
- కరీంనగర్‌లో నుంచి 28మంది, భువనగరిలో 39 మంది అభ్యర్థులు
- ముమ్మర ప్రచారం చేస్తున్న అభ్యర్థులు

సిద్దిపేట, మే 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోకి వచ్చే మెదక్,జహీరాబాద్,కరీంనగర్,భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో 130 మంది బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ స్థానంలో 44 మంది, జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో 19 మంది, కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో 28 మంది, భువనగిరి పార్లమెంట్ స్థానంలో 39 మంది పోటీలో ఉన్నారు. అత్యధికంగా మెదక్ ఎంపీ స్థానంలో అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో వారి భవిష్యత్తు తేలనున్నది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు బరిలో నిలువడంతో వారికి గుర్తులు కేటాయించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

మెదక్ పార్లమెంట్..

మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి 44 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులైన బీఆర్ఎస్ నుంచి వెంకట్రామిరెడ్డి, బీజేపీ నుంచి రఘునందన్ రావు, కాంగ్రెస్ నుంచి నీలం మధు బరి లో ఉన్నారు. మిగతా ఇతర పార్టీలకు చెందిన వారితో పాటు స్వతంత్రులు రంగంలో ఉన్నారు. ఒక ఈవీఎంలో గరిష్టంగా 16 మంది అభ్యర్థుల పేర్లు, ఫొటో, పార్టీ పేరు, గుర్తు వివరాలు ఉంటాయి. ఈ నియోజకవర్గంలో మూడు ఈవీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ వరుస విజయాలు సాధిస్తూ వస్తుంది. వరుసగా ఐదుసార్లు విజయం సాధించింది. డబుల్ హ్యాట్రిక్ దిశగా బీఆర్ఎస్ అభ్యర్థి దూసుకుపోతున్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం..

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్, బీజేపీ నుంచి బీబీపాటిల్, కాంగ్రెస్ నుంచి సురేశ్‌కుమార్ షెట్కార్ బరిలో ఉన్నారు. ఇక్కడ వరుసగా బీఆర్ఎస్ రెండు సార్లు విజయం సాధించింది. హ్యాట్రిక్ విజయం కోసం బీఆర్ఎస్ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నది. 19 మంది బరిలో ఉండడంతో అధికారులు రెండు ఈవీఎంలు ఏర్పాటు చేయనున్నారు.

కరీంనగర్ పార్లమెంట్ స్థానం..

కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో 28మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. బీఆర్ఎస్ నుంచి మాజీఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎం పీ బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి వెలిచాల రాజేందర్‌రావు బరిలో ఉన్నారు. ఇక్కడ రెండు ఈవీఎంలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక ఈవీఎంలో గరిష్టంగా 16 మంది అభ్యర్థుల పేర్లు ఉంటాయి. దీంతో కరీంనగర్‌లో 28 మంది అభ్యర్థులు ఉండడంతో అధికారులు రెండు ఈవీఎంలను ఏర్పాటు చేయనున్నారు.

భువనగిరి పార్లమెంట్..

భువనగిరి పార్లమెంట్ స్థానంలో మొత్తం 39 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక్కడ ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేశ్, కాంగ్రెస్ నుంచి చామ ల కిరణ్‌కుమార్ రెడ్డి, బీజేపీ నుంచి బూర నర్సయ్య గౌడ్ బరిలో ఉన్నారు. వీరితోపాటు ఇక్కడ సీపీఎం అభ్యర్థి కూడా రంగంలో ఉన్నారు. నువ్వానేనా అన్నట్లు ప్రచారం ముమ్మరంగా జరుగుతుంది. ఈ నియోజకవర్గంలో అధికారులు మూడు ఈవీఎంలు ఏర్పాటు చేయనున్నారు.

మాన్య ముఖ్యమంత్రివర్యా.. సిద్దిపేట అభివృద్ధిపై కక్షెందుకు..?

- ఇక్కడి వెటర్నరీ కళాశాలను రద్దుచేసి, కొడంగల్‌కు తరలించుకుపోయావు..
- కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది..
- జిల్లాలో రూ.150 కోట్ల రోడ్ల నిధులు రద్దు
- రేపోమాపో సిద్దిపేట జిల్లా రద్దు చేస్తా అంటున్నావ్...
- ఇవన్నీ రద్దుచేసి మళ్లీ మాఓట్లు అడగడానికి ఎలా వస్తావ్
- సిద్దిపేట జిల్లాకు వచ్చిన నిధులిచ్చి ఓట్లు అడగడానికి రావాలంటున్న నియోజకవర్గ ప్రజలు

సిద్దిపేట, మే 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'అయ్యా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా సిద్దిపేట వెటర్నరీ కళాశాలను రద్దు చేసి, దాని నిర్మాణ పనులను పిల్లర్ల స్థాయిలోనే ఆపి..మీ కొడంగల్ నియోజకవర్గానికి తరలించుకుపోయావు. కళాశాలకు కేటాయించిన రూ.100 కోట్లు రద్దు చేయడంతో ఎంతోమంది విద్యార్థుల ఆశలను నీరుగార్చావు. మా జిల్లా రహదారులకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.150 కోట్లు నిధులను రద్దు చేయడంతో ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఎండీఆర్ ప్లాన్ కింద జిల్లాలో పలు రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలకు కేటాయించిన నిధులను రద్దు చేస్తూ 305 జీవోను ఫిబ్రవరి 24న విడుదల చేసింది నిజం కాదా...? సిద్దిపేట నుంచి ఇల్లంతకుంట రహదారికి మంజూరు చేసిన నిధులను రద్దు చేసి ఇతర జిల్లాలకు ఆ నిధులను మళ్లిలించిన విషయం నిజం కాదా..? రంగనాయక సాగర్ టూరిజం కోసం మంజూరు చేసిన నిధులపై కక్షకట్టావు. దీనికి నిధుల కొరత ఏర్పడింది. సిద్దిపేట కోమటిచెరువు శిల్పారామం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇక పరిపాలన సౌల భ్యం కోసం నూతన జిల్లాలను కేసీఆర్ ఏర్పాటు చేస్తే ...మీరు సిద్దిపేట జిల్లాను రద్దుచేసే కుట్ర చేస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ సిద్దిపేట జిల్లా...దీనిని రద్దు చేయాలనే ఆలోచన మీకు ఎలా వచ్చింది. సిద్దిపేట అభివృద్ధిపై మీకు ఎందుకు ఇంతకక్ష..ఎందుకు ఈ వివక్ష. ఇవన్నీ చేసి ఇవ్వాళ సిద్దిపేట పట్టణానికి ఎలా ఓట్లు అడగడానికి వస్తున్నారో సమాధానం చెప్పాలి. రద్దు చేసిన కళాశాల, ఇతర పనుల నిధులు ఇచ్చాకనే సిద్దిపేట ప్రజల ఓట్లు అడగడానికి రావాలి అంటున్న సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు'

సిద్దిపేట వెటర్నరీ కళాశాల రద్దు..

సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్ నియోజకవర్గానికి తీసుకుపోయాడు. కళాశాల పనులను మధ్యలో ఆపి తరలించుకు పోవడంపై ఇక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. జిల్లాకేంద్రంలో కేసీఆర్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి మేరకు కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో (పీవీ నరసింహరావు తెలంగాణ పశువైద్య విద్యాలయం) వెటర్నరీ కళాశాలను మంజూరు చేశారు.ఈ భవన సముదాయానికి 30ఎకరాల విస్తీర్ణంలో బాలురు, బాలికల వసతితో పాటు కళాశాల నిర్మాణం చేపట్టేలా రూపకల్పన చేశారు. ఇందుకు రూ.180 కోట్లు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్రంలో పశు సంపద పెరగడంతో విప్లవాత్మక మార్పు తెచ్చిన కేసీఆర్ మూగజీవాలకు కూడా ఆ స్థాయిలో వైద్యం అందించాలనే గొప్ప సంకల్పంతో పశువైద్య విద్యకు ప్రోత్సాహాన్ని ఇచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో నిర్మించిన రిజర్వాయర్ల ద్వారా పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. పశుసంపద బాగా వృద్ధి చెందింది. కోళ్ల పెంపకంలో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో ఉంది. జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు అందుబాటులో ఉండేలా ఇక్కడ ప్రభుత్వ వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేయడానికి పూనుకుని రూ.100 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది. 2024 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించడానికి ఉత్తర్వులు విడుదల చేశారు. మన రాష్ట్రంలో హైదరాబాద్, కోరుట్ల, వరంగల్‌లో ఉన్న మూడు పశువైద్య కళాశాలల ద్వారా సుమారు 240 మంది పశు వైద్యులు ఉత్తీర్ణులవుతున్నారు. రాష్ట్రంలో ఉన్న పశుసంపదకు, పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని సరిపడా పశు వైద్యులను తీర్చిదిద్దుటకు ఈ ప్రాంతానికి కళాశాల మంజూరు చేశారు. కళాశాల నిర్మాణంతో ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది అనుకున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రచేసి నిర్మాణంలో ఉన్న కళాశాల పనులు మధ్యలో ఆపి ఆ కళాశాలను కొడంగల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి తరలించుకుపోయారు.

రూ.150 కోట్ల రహదారుల నిధులు రద్దు

కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేట జిల్లాపై కక్ష కట్టింది. సుమారుగా రూ.150 కోట్ల మేర రహదారుల నిధులను రద్దు చేసి ఇతర జిల్లాలకు మళ్లించిందిరు. గజ్వేల్ నియోజకవర్గంలోని పీడబ్ల్యూ రోడ్డు నుంచి కొల్గూరు మీదుగా అహ్మదిపూర్ (0/0 నుంచి 4/0)వరకు రూ.3 కోట్లు, మీనాజీపేట నుంచి బస్వాపూర్ మీదుగా కొక్కండ (0/0 నుంచి 0/10)వరకు రూ.3 కోట్లు, రాజీవ్ రహదారి పీడబ్ల్యూ రోడ్డు మీదుగా ముట్రాజ్‌పల్లి (0/0 నుంచి 7/2)వరకు రూ.30 కోట్లు, మర్కూక్ నుంచి నారాయణపూర్ (0/0 నుంచి 10/0) వరకు రూ.23 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డు పనులు పురోగతిలో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని హత్నూర్ మండలం టౌన్ లిమిట్స్ దౌల్తాబాద్ –చిట్కుల్ రహదారి విస్తరణ (కి.మీ 5/3 నుంచి 8/2)రూ. 8 కోట్లు, సిద్దిపేట – ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు(కి.మీ 22/0 నుంచి 32/0) రూ.82 కోట్లు (రాజన్నసిరిసిల్ల జిల్లా), సిద్దిపేట –ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు (కి.మీ 10/0 నుంచి 22/0) రూ.77 కోట్లు , సంగారెడ్డి– నర్సాపూర్ –తూప్రాన్ రోడ్డు (కి.మీ 71/0 నుంచి 72/5, 77/4 నుంచి 78/4)(ఆరు వరుసల రహదారి సిద్దిపేట జిల్లాలో) రూ.19 కోట్లను కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించి నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తూ 305 జీవోను జారీ చేసి ఇతర జిల్లాలకు ఈ నిధులను మళ్లించింది.

సిద్దిపేట జిల్లా రద్దుకు కుట్ర

సిద్దిపేట జిల్లా ఎన్నో ఏండ్ల కల..ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసింది. నూతన సమీకృత కలెక్టరేట్ నిర్మాణంతోపాటు రెవెన్యూ డివిజన్లు, నూతన మండలాలు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరిగింది. సమైక్య రాష్ట్రంలో ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా జిల్లాను ఏర్పాటు చేయలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక జిల్లా ఏర్పాటు కావడంతో అన్ని రంగాల్లో సిద్దిపేట జిల్లా అగ్రగామిగా నిలిచింది. దీనిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేట జిల్లా రద్దుకు కుట్రలు చేస్తున్నది. జిల్లాల రద్దుపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. తద్వారా ప్రజలకు సేవలు దూరం కానున్నాయి.

సిద్దిపేట వెటర్నరీ కళాశాలను రద్దు చేయడంతో పిల్లర్ల స్థాయిలో ఆగిన నిర్మాణ పనులు